## క్లుప్తంగా

### విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్ జూబిలీ ఇండోర్ సబ్‌స్టేషన్, 11కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలరెడ్డిరోడ్డు, డీజీపీ ఆఫీస్ ఏరియా, ప్రకాశం రోడ్డు, ఆంధ్రా హాస్పిటల్ ఏరియా, నక్కలరోడ్డు, కాశేశ్వరావు రోడ్డు, వెంకటరత్నం వీధి, భవానీ వీధి, విష్ణువర్ధన రావు వీధి, మాదిరెడ్డి వారి వీధి, డోర్నకల్ రోడ్డు, నరసింహరావునాయుడు వీధి, గోవిందరాజులునాయుడు వీధి, చిలుకు దుర్గయ్య వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. దుర్గాపురం సబ్‌స్టేషన్, 11కేవీ మ్యూజిక్ కాలేజీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఈ నెల 25వ తేదీ మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రామకోటిమైదానం, శారద కాలేజీ లైన్, పి.వి.రాజు స్ట్రీట్ , నోరి హాస్పిటల్ ఏరియా, రాజగోపాలచారి మార్కెట్ ఏరియాల్లో కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

### గ్రంథాలయానికి వస్తువుల బహూకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి దాతలు రూ. 15 వేలు విలువైన వస్తువులను వితరణగా ఇచ్చారు. గ్రంథాలయ కార్యాలయానికి కావాల్సిన గోద్రెజ్ ఐరన్ సేఫ్, ఆఫీస్ టేబుల్, తాగునీటి ట్యాంక్‌కు నీటిని ఎక్కించడానికి లక్ష్మీ కంపెనీ మోటారును దాతలు బహూకరించారు. దాతలను గ్రంథాలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది జి.ఉమారాణి, రమేష్, ధనలక్ష్మి, రాంబాబు, కుమార్ పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



గుణదల(విజయవాడ తూర్పు): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని 4వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రమేష్ అన్నారు. గుణదల మహానాడు రింగ్ రోడ్డు వద్ద ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు జాగ్రత్తగా రాకపోకలు సాగించాలని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హెల్మెట్ వినియోగంతో ప్రాణ హాని ఉండదని వివరించారు. పాదచారులు జీబ్రాలైన్లను అనుసరించి నడవాలన్నారు. సిగ్నలింగ్‌కు అనుగుణంగా వాహనాలు ముందుకు సాగాలని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు అనుసరించే విధి విధానాలను విద్యార్థులకు తెలియజేశారు. డ్రెస్ కోడింగ్, ట్రాఫిక్ వ్యవస్థపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ప్లకార్డులను పట్టుకుని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ, ఎస్ఐ రాజేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### చెత్తాచెదారం తొలగించారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్‌రోడ్డు, బుడమేరు పక్కన, డొంక రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారం తొలగించారు. బాబ్‌గేట్ సాయంతో రోడ్డు పక్కన పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను సరిచేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తాచెదారాన్ని కాలువల్లో వేస్తే దోమలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో మేస్త్రి శ్రీను, వార్డు సచివాలయం శానిటరీ సెక్రటరీ సుధీర్ పాల్గొన్నారు.

# నత్తనడకన పైప్‌లైన్ పనులు!

- ముత్యాలంపాడులో ప్రజల అవస్థలు
- రోజులు గడుస్తున్నా గోతులు పూడ్చని వైనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో వాటర్, యూజీడీ పైపులైన్ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ముత్యాలంపాడు యూజీడీ పంపింగ్ స్టేషన్ నుంచి అంబేడ్కర్‌కాలనీ శ్మశానం వరకు పైపులైన్ ఏర్పాటుచేసి చాలా కాలం కావడంతో లీకేజీలు వస్తున్నాయి. నాటి జనాభాకు అనుగుణంగా నిర్మించిన పైపులైన్‌లు ఇప్పటి అవసరాలకు సరిపోవడంలేదు. దీంతో ముత్యాలంపాడు యూజీడీ పంపింగ్ స్టేషన్ నుంచి అంబేడ్కర్ కాలనీ శ్మశానం వరకు సుమారు రెండు కోట్ల వ్యయంతో యూజీడీ పైపులైన్ పనులు 15 రోజుల క్రితం ప్రారంభించారు.



ముత్యాలంపాడులో జరుగుతున్న పనులు

### సహనానికి పరీక్ష

ఇక్కడ పనులు నత్తనడకన సాగుతూ సహనాన్ని పరీక్షిస్తున్నాయి. తవ్విన గోతులను 10 రోజులైనా పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును తవ్వి పనులు చేపట్టిన తర్వాత గోతులు పూడ్చి వేయాలి. తర్వాత మరికొంత భాగం తవ్వితే తిప్పలు తప్పుతాయి. కానీ ముందుగానే రోడ్డును తవ్వడంతో ఇబ్బందుల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ ముద్రణాలయం వద్ద తవ్విన గోతులను సక్రమంగా పూడ్చని దృశ్యం

### భానునగర్‌లో..

భానునగర్‌లో తాగునీటి సమస్యల పరిష్కారానికి వాటర్ పైపులైన్ పనులు చేపట్టారు. అయితే ఇక్కడ కూడా రోడ్డును తవ్వి కొత్త పైపులైన్‌లు వేస్తున్నారు. తవ్విన గోతులను వెంటనే పూడ్చడం లేదు. దీంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ పనుల కోసం తవ్విన మట్టిని సరిచేయకుండా వదిలివేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గోతుల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు వేగవంతం చేసి వేసవిలోపు భానునగర్ వాసులకు తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

### ఆందోళనగా ఉంది



నిత్యం రద్దీగా ఉండే భానూనగర్ బీఆర్టీఎస్ రోడ్డు మలుపులో వాటర్ పైపులైన్ కోసం తవ్విన మట్టిని సరిచేయలేదు. పది రోజులుగా మట్టి దిబ్బలు అలాగే ఉన్నాయి. దీంతో రాకపోకలు సాగించే సమయంతో పాలు మలుపు తిరిగే క్రమంలో ఎప్పుడ ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలి. రోడ్డును సరిచేయాలి.

–బోనం పూర్ణ, స్థానికుడు



బీఆర్టీఎస్ రోడ్డు మలుపులో పదిరోజులుగా రహదారిపై మట్టి దిబ్బలు

## ఎండ.. జాగ్రత్తలే అండ





నగరంలో రోజురోజుకూ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉష్ణోగ్రతలు అధికమవుతుండటంతో అత్యవసర పనులపై బయటకు వచ్చే వారు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సోమవారం గొడుగులు, స్కార్ఫ్‌లతో ప్రయాణికులు ఎండ నుంచి రక్షణ పొందారు. కొబ్బరి నీళ్లు, ఇతర పానీయాలతో ఉపశమించారు. ఏసీ బస్‌షెల్టర్లలో ప్రయాణికులు సేద తీరుతూ కనిపించారు. చలివేంద్రాల వద్ద దాహార్తి తీర్చుకున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలను వేగంగా, సమర్థంగా పరిష్కరించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారంపై అధికారులకు దృష్టి సారించాలని చెప్పారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో ఆయన నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పౌరుల అవసరాలు, నగరాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల పెంపు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి నగరపాలక సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 24 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు.



నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

# కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత నెరవేర్చాలి

**విద్యార్థులకు మలబార్ సంస్థ స్కాలర్‌షిప్‌ల పంపిణీ**

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత నెరవేర్చాలని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. పేర్కొన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదరికంతో పిల్లల చదువులు ఆగిపోకూడదన్నారు. కార్పొరేట్ సంస్థలు కేవలం వ్యాపార దృక్పథంతో మాత్రమే కాకుండా మలబార్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సామాజిక సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సేవలో భాగస్వాములు కావాలని కోరారు. మలబార్ గ్రూప్ రెస్ట్ ఆఫ్ ఇండియ రిటైల్ హెడ్ సిరాజ్ పీకే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ ఏడాది 21 వేల మంది బాలికల విద్యకు మద్దతుగా రూ.716 కోట్లు కేటాయించామని తెలిపారు. ఏపీలోని 142 కళాశాలల్లో 1,928 మంది విద్యార్థినులకు రూ.1.67 కోట్లు స్కాలర్‌షిప్ కేటాయించామని చెప్పారు. వీరిలో గుంటూరు. విజయవాడ, ఏలూరు ప్రాంతాలకు చెందిన 583 మంది విద్యార్థినులకు రూ.48.60 లక్షలను అందించామని వివరించారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ మాట్లాడుతూ మనిషి ఎదుగుదలకు విద్య శక్తివంతమైనదని, విద్యార్థులు జీవితాలను మార్చడమే మలబార్ గ్రూప్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో 'తూర్పు' ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు, మలబార్ గోల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గద్దె

## క్షయ వ్యాధిపై అప్రమత్తం

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్షయ వ్యాధి అనేది కింగ్ ఆఫ్ డిసీజ్ అని దీనికి వ్యాక్సిన్, మంచి మందులు అందుబాటులో ఉన్నా జాగ్రత్తలు పాటించాలని సిద్ధార్థ గవర్నమెంట్ మెడికల్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ విఠల్ రావు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యాన ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ దగ్గు, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట జ్వరం రావడం క్షయ వ్యాధి లక్షణాలు అన్నారు.

**అవగాహన పెంచుకోవాలి**

ప్రతి ఒక్కరూ క్షయవ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇది శరీరంలోని ఏ భాగానికైనా సోకే అవకాశం ఉందన్నారు. క్షయ నివారణకు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అజాగ్రత్తతో ఎంతో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. క్షయ వ్యాధిపీడితులు మాట్లాడినా తుమ్మినా, దగ్గినా నోటికి అడ్డు పెట్టుకోవాలని సూచించారు. జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లిస్టులో 'క్షయ' డేంజరస్ వ్యాధిగా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కొల్లేటి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డి.యుగంధర్, అధ్యాపకులు డాక్టర్ కేఆర్‌జీ శేషు కుమార్, అరుణ, వకులప్రియ, దినేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాస విఠల్‌రావు, భాగ్యలక్ష్మి

# ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ ఆన్‌లైన్ మోసాలు అధికమవుతున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండాలని మాచవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ భాగ్యశ్రీ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన ఆన్‌లైన్ మోసాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చదువులేని వారితో పాటు విద్యావంతులు కూడా ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారన్నారు. వీటి నుంచి ఎలా రక్షించుకోవాలో వివరించారు. విజయవాడ రీజనల్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ ఎస్‌కే సుమన్, చీఫ్ మేనేజర్ భద్రు మాట్లాడారు. యూనియన్ బ్యాంక్ అందించే విద్యారుణాలను వివరించారు. బ్యాంకింగ్ మోసాలపై ఫిర్యాదులను టోల్‌ఫ్రీ నంబర్ 1930కు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్ కె.నవీన, కొండలరావు, లక్ష్మీ భారతి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న యూబీ మేనేజర్ భాగ్యశ్రీ

### తాగునీటి సరఫరాలో అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి గులాముద్దీన్ నగర్ రిజర్వాయర్‌కు వెళ్తున్న ప్రధాన నీటి సరఫరా చేసే 400 ఎంఎం డయా పంపింగ్ మెయిన్ లైన్ మరమ్మతుల కారణంగా సర్కిల్–2 పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం నుంచి 26వ తేదీ ఉదయం వరకు పలు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. సీతారాంపురం, మాచవరం డౌన్, నేతాజీ రోడ్డు, అరండల్‌పేట, గవర్నర్‌పేట, గులాముద్దీన్ నగర్ కొండ, కడియాల వారి వీధి, బ్రహ్మానంద రెడ్డి నగర్‌లోని 8వ రోడ్డు వరకు, నిమ్మతోట కొండ, విశాలాంధ్రరోడ్డు, శ్రీనివాసరావు వీధి, బారెస్ట్ వారి వీధి, బంకపల్లి వీధి, బోయపాటి వారి వీధి, టి. వెంకటేశ్వరరావు వీధిలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. ఆయా ప్రాంత వాసులు ముందుగానే నీటి నిల్వలు చేసుకోవాలని సూచించారు.

### ఇఫ్తార్ విందును విజయవంతం చేయండి



పాయకాపురం(విజయవాడరూరల్): పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈ నెల 26న ఎస్ఎసీ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన జరిగే ఇఫ్తార్ విందును ముస్లింలు విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం పైపులరోడ్డు సమీపం (అంబాపురం)లోని ఎండీ కరీమున్నీసా మసీదులో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆధ్వర్యాన జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అంజాద్‌బాషా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ముస్లిం పక్షపాతిగా పేరుగడించారన్నారు. ఆయన తండ్రి వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో హఫీజుల్లా, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

### రెస్టారెంట్లలో అగ్నిమాపక నిరోధక పరికరాల తనిఖీ

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రెస్టారెంట్లో అగ్ని ప్రమాద నిరోధక పరికరాల పనితీరుపై వీఎంసీ అగ్నిమాపక విభాగం తనిఖీలు నిర్వహించింది. గురువారం బెంజి సర్కిల్ వద్ద ప్లాట్‌ఫాం–65 రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో సోమవారం ఆర్ఆర్ దర్బార్, రాజా దర్బార్, సదరన్ స్పైస్, కడియ పట్టణం రెస్టారెంట్స్, హోటల్స్‌ని అధికారులు తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, మంటలను ఎలా ఆర్పాలో తెలిపారు. ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటితో స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై రెస్టారెంట్ సిబ్బందికి అవగాహన కల్పించారు. తనిఖీ లో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు



రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న వీఎంసీ ఫైర్ సిబ్బంది




